క్లుప్తంగా

షేర్‌మహ్మద్‌పేట-గండ్రాయి రోడ్డు ప్రారంభం



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట అర్బన్‌): ముఖ్యమంత్రి వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మారుమూల గ్రామాలకు సైతం బీటీ రోడ్లు నిర్మించినట్లు ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. పేట మండలంలోని షేర్‌మహ్మద్‌పేట–గండ్రాయి గ్రామాల మధ్య రూ.2.50 కోట్లతో నిర్మించిన ప్రధాన రహదారిని బుధవారం ఉదయభాను ప్రారంభించారు. ఈసందర్భంగా విప్‌ ఉదయభాను మాట్లాడుతూ నియోజకవర్గంలో వందలాది కోట్లతో సీసీరోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. షేర్‌మహ్మద్‌పేట క్రాస్‌ రోడ్డు నుంచి పేటలోని మార్కెట్‌ యార్డు వరకు డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పోలింగ్‌ కేంద్రాల పరిశీలన

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్‌ రాజకిషోర్‌ తెలిపారు. మండలంలోని పెద్దాపురం, తిమ్మాపురం, గూడెంమాధవరం గ్రామాల్లోని పోలింగ్‌ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ మాట్లాడుతూ ఆయా పోలింగ్‌ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. డిప్యూటీ తహసీల్దార్‌ ఆంజనేయులు పాల్గొన్నారు.

నూతన సైన్స్‌ ఆవిష్కరణలతోనే అభివృద్ధి



పెనుగంచిప్రోలు: నూతన సైన్స్‌ ఆవిష్కరణల ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని ఇన్‌చార్జి హెచ్‌ఎం వేగినేటి వెంకటరమణ పేర్కొన్నారు. జాతీయ సైన్స్‌ దినోత్సవం సందర్భంగా స్థానిక కేవీఆర్‌ జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఎగ్జిబిషన్‌ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్‌ ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాసరావు, ఎస్‌.ప్రసాద్‌, రాము, నిరంజన్‌, ప్రభుదాస్‌, సుబ్బారావుపాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనలతో విద్యార్థులకు ఎంతో మేలు

నందిగామ: విజ్ఞాన ప్రదర్శనలతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని నందిగామ పట్టణ ఎస్‌ఐ హనీష్‌ పేర్కొన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో బుధవారం సైన్స్‌ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం ఎస్‌ఐ హనీష్‌ మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే వారిలో మేధాశక్తి ప్రపంచానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపాల్‌ గుత్తా ప్రదీప్‌, సిబ్బంది పాల్గొన్నారు. రామిరెడ్డిపల్లి, పల్లగిరి ఎంపీయూపీ పాఠశాల, మాగల్లులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్‌ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వైభవంగా ప్రతిష్టా మహోత్సవం

లింగగూడెం(పెనుగంచిప్రోలు):మండలంలోని లింగగూడెంలో శ్రీహనుమాన్‌ సీతా లక్ష్మణ సహిత శ్రీకోదండరామస్వామి ఆలయ ప్రతిష్ఠ, జీవ ధ్వజ, విమాన శిఖర, గణేష్‌, నాగరాజ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం భక్తుల జయ జయ ధ్వానాల మధ్య వైభవంగా జరిగింది. పరాంకుశం అచ్యుతాచార్యులు, తిరుమల తిరుపతి ఆలయ వేద విశ్వవిద్యాలయ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ రొంపిచర్ల వెంకట సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో పూజలు, హోమాలు, ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

అభివృద్ధి పథంలో ఇందుగపల్లి

- సచివాలయం, ఆర్బీకే, వైద్యశాల నిర్మాణం.. • పాఠశాల అభివృద్ధి
- మంచినీటి ట్యాంక్‌ నిర్మాణం • డీబీటీ ద్వారా రూ.15.55కోట్లు అందజేత



రైతుభరోసా కేంద్రం



ఇందుగపల్లి(వత్సవాయి): గ్రామాల్లో ప్రజలకు అవసరమయ్యే మంచినీరు..రోడ్లు..విద్య, వైద్యం తదితర కనీస మౌలికవసతుల కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. ఈ వసతులను కల్పించడం ద్వారానే గ్రామాభివృద్ధి సాధ్యమని భావిస్తూ గ్రామీణ ప్రజలకు మంచినీరు, సరైన రోడ్లు, విద్య, వైద్య సేవలను అందించడం కోసం కోట్లాది రూపాయలను ఖర్చుచేస్తూ గ్రామాల అభ్యున్నతికి కృషి చేస్తోంది. అందుకు ఉదాహరణ వత్సవాయి మండలంలోని ఇందుగపల్లి గ్రామమే. ఈ గ్రామజనాభా సుమారు 3వేలు ఉంటుంది. గత పాలకుల నిర్లక్ష్యానికి గురై అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిన ఇందుగపల్లిలో సీఎం వైఎస్‌ జగన్‌మోహనరెడ్డి పాలనలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ సామినేని ఉదయభాను నేతృత్వంలో గ్రామస్తులకు రూ.కోటిన్నర ఖర్చుచేసి మౌలికవసతులు కల్పించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

85లక్షలతో ప్రభుత్వ భవనాలు..

గతంలో జనన, కుల ధ్రువీకరణతోపాటు ఆయా సర్టిఫికెట్లు, ఇతర పౌర సేవల కోసం గ్రామస్తులు మండల కేంద్రానికి వెళ్లక తప్పేది కాదు. కాని నేడు సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక గ్రామ పొలిమేర దాటే అవసరం లేకుండానే జనన, ఆదాయ, కుల ధ్రువీకరణపత్రాలతోపాటు వందలాది పౌరసేవలకు గ్రామ సచివాలయమే కేరాఫ్‌ అడ్రస్‌గా మారింది. ఈనేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఇందుగపల్లిలో రూ.85లక్షలతో సచివాలయం, రైతుల కోసం రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్‌ హెల్త్‌ క్లీనిక్‌లకు పక్కభవనాలను నిర్మించింది. ఈ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చి గ్రామస్తులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నాయి. రైతుభరోసా కేంద్రం ద్వారా ఈ-క్రాప్‌, పంటల బీమా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువుల పంపిణీ వంటి సేవలు అందుతుండటంతో గతంలో మాదిరి పనులు మానుకుని మండల కేంద్రానికి వెళ్లే తిప్పలు తప్పాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

19లక్షలతో సీసీరోడ్లు, ట్యాంకు నిర్మాణం..

గ్రామంలోని ఎస్సీ, బీసీలు నివసించే ప్రాంతాల్లో రూ.15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని పూర్తిచేశారు. అదేవిధంగా గ్రామంలో మంచినీటి ఎద్దడిని నివారించేందుకు రూ.4లక్షలతో నూతనంగా మంచినీటి ట్యాంక్‌ నిర్మాణం చేశారు. గతంలో ట్యాంక్‌ నిర్మాణం లేకపోవడంతో మంచినీటి కోసం ఇబ్బందులు పడేవారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కృషితో ఆర్‌డబ్ల్యూఎస్‌ నిధులు మంజూరు కావడంతో ఈ ట్యాంక్‌ నిర్మించడంతో సమస్య పరిష్కారమైంది.

పేదల ఇళ్లకు అడ్డుపడిన టీడీపీ..

గ్రామంలోని 100 మంది పేదలను గుర్తించి, వారికి నవరత్నాలు పథకంలో భాగంగా ఇళ్లస్థలం మంజూరు చేసేందుకు ఎమ్మెల్యే ఉదయభాను సహకారంతో గ్రామపరిధిలో మూడెకరాల స్థలాన్ని అధికారులు గుర్తించారు. అయితే గ్రామంలోని పేదలకు ఇళ్లస్థలాలు అందితే వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని, తద్వారా తమ రాజకీయభవితవ్యానికి ముప్పు ఏర్పడుతుందని ఆందోళనతో కొందరు టీడీపీ నాయకులు కోర్టు ద్వారా స్టే ఆర్డర్‌ తీసుకువచ్చి ఇళ్లస్థలాల పంపిణీని అడ్డుకున్నారు. దీంతో టీడీపీ నాయకుల చర్యపై పేదలు మండిపడుతున్నారు.

20లక్షలతో పాఠశాల అభివృద్ధి..

పేదప్రజల పిల్లలకు సైతం కార్పొరేట్‌స్థాయి విద్యనందించే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాడు–నేడు పథకాన్ని అమలుచేస్తోంది. నాడు–నేడు ఫేజ్‌–2లో భాగంగా గ్రామంలోని పాఠశాలకు రూ.20లక్షలు కేటాయించింది. ఈ నిధులతో పాఠశాలలో విద్యుత్‌ సరఫరా, మరుగుదొడ్లు, రన్నింగ్‌ వాటర్‌, పెయింటింగ్స్‌, గ్రీన్‌ చాక్‌బోర్డు, విద్యార్థులు కూర్చునేందుకు బల్లలు, ఇతర మౌలికవసతులు ఏర్పాటు చేస్తున్నారు.



ఇందుపల్లిలోని గ్రామసచివాలయం



నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంక్‌

డీబీటీ ద్వారా రూ.15.05కోట్లు..

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల తొమ్మిది నెలల పాలనలో నవరత్నాలు పథకాల కింద ఇప్పటివరకు రూ.15.55కోట్లను రాష్ట్రప్రభుత్వం నేరుగా ఇందుగపల్లి గ్రామస్తుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది.నాన్‌ డీబీటీ కింద రూ.4.28కోట్లను ఖర్చుచేసింది. వైఎస్సార్‌ ఆసరా, చేయూత, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, రైతుభరోసా, పంటల బీమా తదితర సంక్షేమ పథకాల ద్వారా ఏటా కోట్లాది రూపాయలను అందిస్తూ ప్రజల జీవనస్థితిగతులు మెరుగుపడేందుకు సీఎం జగనన్న ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఇందుగపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.ఇలా సంక్షేమ పథకాలు అందిస్తూ, అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఎంతో సహకారం అందిస్తుండటం ఆనందంగా ఉందని వారు చెబుతున్నారు.

అభివృద్ధిలో ముందంజ..



గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. రెండేళ్ల పాటు కరోనా ఇబ్బందులు ఎదురైనా కూడా గ్రామాభివృద్ధి ఆగలేదు. ఎమ్మెల్యే ఉదయభాను సహకారంతో సచివాలయ భవనాలు, నాడు–నేడు ద్వారా పాఠశాల రూపురేఖలు మారిపోయాయి.

వాసిరెడ్డి కృష్ణారావు, సొసైటీ చైర్మన్‌

అభివృద్ధికే మద్దతు..



అభివృద్ధి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఎప్పటికీ మరువరు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేక చొరవతోనే మాగ్రామంలో అనేక పనులు చేపట్టారు. అభివృద్ధి చేసేవారికే అండగా ఉంటాం.

సీహెచ్‌ కృష్ణారావు, గ్రామస్తుడు

దర్జీల అభ్యున్నతికి సీఎం జగన్‌ కృషి

ప్రభుత్వ విప్‌ ఉదయభాను



విప్‌ సామినేని ఉదయభానును సన్మానిస్తున్న టైలర్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్‌: దర్జీలు(టైలర్లు) ఉన్నతంగా ఉండాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో వారి అభ్యున్నతి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. టైలర్స్‌ డే సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలోని సామినేని విశ్వనాథం కార్మికనగర్‌లో జగ్గయ్యపేట టైలర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని కేక్‌ కట్‌ చేసి టైలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. విప్‌ ఉదయభాను మాట్లాడుతూ టైలరింగ్‌ వృత్తిలో ఉన్న వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, సీఎం వైఎస్‌ జగన్‌ ఏటా రూ.10వేలను పార్టీలకు అతీతంగా జగనన్న చేదోడు పథకం కింద వారి అకౌంట్‌లో జమచేస్తున్నారని తెలిపారు. దర్జీలంతా ఐక్యంగా టైలర్స్‌ డే వేడుకలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం ఉదయభానును టైలర్లు సన్మానించారు. మున్సిపల్‌ చైర్మన్‌, వైస్‌ చైర్మన్లు రంగాపురం నరసింహారావు, తుమ్మల ప్రభాకర్‌, పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్‌ కార్యదర్శి బద్దూనాయక్‌, పట్టణ కార్మిక విభాగం అధ్యక్షుడు గోగుల వెంకయ్య, టైలరింగ్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు రవిబాబు, సుబ్బారావు, శివనాగ సైదులు, టైలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్‌ గైడెన్స్‌పై వర్క్‌షాపు



కంచికచర్ల :విద్యార్థులు ఎంచుకునే కోర్సు ఆధారంగానే వారి భవిష్యత్‌ ఆధారపడి ఉంటుందని డాన్‌బోస్కో నవజీవన్‌ బాల భవన స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్‌ మేరుగ రత్నం పేర్కొన్నారు. మండలంలోని గొట్టుముక్కల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం తొమ్మిది, పదోతరగతి విద్యార్థులకు కెరీర్‌ గైడెన్స్‌పై ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ జీవితంలో మంచి భవిష్యత్‌ పొందాలంటే చిన్నతనం నుంచి కష్టపడి చదువుకోవాలని సూచించారు. పదోతరగతి పూర్తయిన తర్వాత ఎలాంటి కోర్సులు తీసుకోవాలనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చావా రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీల నియంత్రణకు చర్యలు : ఎస్‌ఐ

నందిగామ: స్టేషన్‌ పరిధిలో దొంగతనాల నియంత్రణ కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలకు వ్యాపారులు కూడా సహకరించాలని పట్టణ ఎస్‌ఐ హనీష్‌ కోరారు. పట్టణంలోని బంగారపు కొట్ల వ్యాపారులతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చోరీలు చోటుచేసుకోకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ హనీష్‌ మాట్లాడుతూ ప్రతి బంగారం దుకాణం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు ముఖ్యంగా వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో చోరీలు జరగకుండా పోలీసులు తీసుకునే చర్యలకు సహకరించాలని కోరారు.



సీఎంఆర్‌ఎఫ్‌ కింద రూ.24.94లక్షలు అందజేత



సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్‌ అరుణకుమార్‌

నందిగామ టౌన్‌: నిరుపేదలకు వైద్యఖర్చులు భారం కాకూడదనే మంచిమనసుతో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికసాయం అందించి ఆదుకుంటున్నారని ఎమ్మెల్సీ డాక్టర్‌ మొండితోక అరుణకుమార్‌ కొనియాడారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 16మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.24.94 లక్షల విలువగల చెక్కులను స్థానిక వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్‌ మాట్లాడుతూ నిరుపేదలకు కార్పొరేట్‌ స్థాయిలో మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వివరించారు.

438మందికి రూ.2.60 కోట్లు..

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇప్పటివరకు నందిగామ నియోజకవర్గంలోని 438 మందికి సీఎంఆర్‌ఎఫ్‌ కింద రూ.2.60 కోట్లను అందజేసినట్లు ఎమ్మెల్సీ అరుణకుమార్‌ తెలిపారు. వైద్యంఖర్చు రూ. వెయ్యి దాటితే ఉచితంగా వైద్య సేవలందించేలా ఆరోగ్య శ్రీ పథకంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులు చేయడంతోపాటు ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం పొందే వెసులుబాటు కల్పించారని కొనియాడారు. మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ పాకాలపాటి కిరణ్‌, నాయకులు గుడివాడ సాంబశివరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్‌, వేమా సురేష్‌బాబు, మన్నెం దాసు, నాదెండ్ల నరేంద్ర, పిల్లి జయరాజు, బండారుపల్లి కపిల్‌, షోడగిరి సతీష్‌, మార్త శ్రీను, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిగామ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా ఓర్సు లక్ష్మి

నందిగామ టౌన్‌: నందిగామ మున్సిపాలిటీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా వైస్‌చైర్‌పర్సన్‌ ఓర్సు లక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఓర్సు లక్ష్మికి ఎమ్మెల్సీ అరుణకుమార్‌ అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అవసరమైన మౌలికవసతుల కల్పనతోపాటు పురపాలక సంఘ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. కౌన్సిలర్లు, అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా పట్టణాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని ఓర్సు లక్ష్మికి సూచించారు. ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌ ఓర్సు లక్ష్మి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా నియమించిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, తన నియామకానికి కృషి చేసిన శాసన సభ్యుడు డాక్టర్‌ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్‌ మొండితోక అరుణకుమార్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కౌన్సిలర్లు, పార్టీ నాయకులు ఓర్సు లక్ష్మిని ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ హేమమాలిని, ఏఈ ఫణి శ్రీనివాస్‌, ఏఎంసీ చైర్మన్‌ మహ్మద్‌మస్తాన్‌, మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ పాకాలపాటి కిరణ్‌, నాయకులు గుడివాడ సాంబశివరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్‌, పాములపాటి రమేష్‌, ఓర్సు జ్వాలా, విశ్వనాధపల్లి కృపారావు, బాపట్ల సాంబయ్య, గద్దె రమేష్‌ పాల్గొని ఓర్సు లక్ష్మిని అభినందించారు. నందిగామ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మండవ వరలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందడంతో ఆమెస్థానంలో ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా ఓర్సు లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు.



ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌ ఓర్సు లక్ష్మిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్‌, నాయకులు

12మంది జూదరుల అరెస్ట్‌

కంచికచర్ల : మండలంలోని చెవిటికల్లు, గనిఆత్కూరు గ్రామాల్లో పేకాడుతున్న 12మందిని పట్టుకున్నట్లు ఎస్‌ఐ పీవీఎస్‌ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. వారి నుంచి రూ.16,800 నగదు స్వాధీనం చేసుకుని బైక్‌లు, సెల్‌ఫోన్లను సీజ్‌చేసినట్లు వివరించారు. నిందితులను గురువారం నందిగామ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష

జగ్గయ్యపేట అర్బన్‌: ఎన్నికల విధుల్లో పోలింగ్‌ సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జగ్గయ్యపేట నియోజకవర్గ రిటర్నింగ్‌ ఆఫీసర్‌, జిల్లా సివిల్‌ సప్లయ్‌ డీఎం జి.వెంకటేశ్వర్లు సూచించారు.స్థానిక మున్సిపల్‌ కౌన్సిల్‌ మీటింగ్‌ హాల్‌లో నియోజకవర్గ స్థాయిలోని సెక్టార్‌, పోలీస్‌ అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి తహసీల్దార్లు జీవీ.శేషగిరి, ఎం.రవి, అమ్మాజీ, సీఐ జానకీరామ్‌, ఎలక్షన్‌ డీటీ యు.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిలువగిరి మహోత్సవాలు

నందిగామ : పరిశుద్ధ శిలువగిరి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన బుధవారం రెవరెండ్‌ ఫాదర్‌ దగాని జేవియర్‌ సువార్త స్వస్థత ప్రార్థనలు నిర్వహించడంతోపాటు దివ్యబలి పూజ సమర్పించారు. రాత్రివేళ పలు సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. నందిగామ పట్టణంతోపాటు రామిరెడ్డిపల్లి, జొన్నలగడ్డ, వెల్లుర్తిపాడు, కొణతమాత్మకూరు, గోళ్లమూడి తదితర గ్రామాల సంఘస్తులు పాల్గొన్నారు.

సీవీ రామన్‌కు ఘననివాళి

కంచికచర్ల : నోబెల్‌ బహుమతి గ్రహీత డాక్టర్‌ సీవీ రామన్‌ జయంతి వేడుకల సందర్భంగా బుధవారం జాతీయ సైన్స్‌ దినోత్సవాన్ని మండలంలోని ఆయా పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఉన్నత పాఠశాలల్లో సైన్స్‌ ప్రదర్శన ఏర్పాటు చేశారు. వక్తృత్వం, వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక మిక్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో జాతీయ సైన్స్‌ దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర అకాడమి సెక్రటరీ ఆఫ్‌ సైన్సెస్‌ కార్యదర్శి ప్రొఫెసర్‌ ఎం.బసవేశ్వరరావు పాల్గొని సీవీ రామన్‌ మహోన్నత ప్రయోగాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ టి.వంశీకిరణ్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సముచిత స్థానం

ఎమ్మెల్సీ అరుణకుమార్‌

నందిగామ టౌన్‌: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఉన్నత పదవులు కల్పించిన ఘనత నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావుకే దక్కిందని ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్‌ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతపాలకులు రిజర్వేషన్‌ ప్రకారం వచ్చిన సీట్లనే ఆయా వర్గాలకే కేటాయించేవారని, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ఓపెన్‌ కేటగిరీలోని పదవులను సైతం బీసీ, ఎస్సీలకు కేటాయిస్తుండటం అభినందనీయమన్నారు. నందిగామ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బీసీమహిళ ఓర్సు లక్ష్మి బాధ్యతలు చేపట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. గత పాలకులకు సాధ్యంకాని రీతిలో మున్సిపల్‌ చైర్మన్‌, ఏఎంసీ చైర్మన్‌, కంచికచర్ల ఎంపీపీ, వీరులపాడు వైస్‌ఎంపీపీలతోపాటు ఆయా పదవులను బీసీలకు కట్టబెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. వందలాది కోట్లతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసి, అభివృద్ధి విషయంలో తమ మార్క్‌ చూపించామన్నారు. అభివృద్ధిలో తమ పనితీరు నచ్చితేనే రానున్న ఎన్నికల్లో ఓటువేసి తమను గెలిపించాలని కోరారు. ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌ ఓర్సు లక్ష్మి, ఏఎంసీ చైర్మన్‌ మహ్మద్‌ మస్తాన్‌, వైస్‌చైర్మన్‌ పాకాలపాటి కిరణ్‌ మందా మరియమ్మ, యాకుబ్‌ అలీ, రాము, మన్నెం దాసు, సాంబయ్య, ఖాలిక్‌ పాల్గొన్నారు.

పెండింగ్‌ పనులు పూర్తి చేయాలని ఆదేశం

మున్సిపాలిటీ పరిధిలోని 20వార్డుల్లో ఉన్న పెండింగ్‌ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్‌ మొండితోక అరుణకుమార్‌ ఆదేశించారు. మున్సిపల్‌ అధికారులు, కౌన్సిల్‌ సభ్యులు, కాంట్రాక్టర్లతో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పెండింగ్‌ పనులను ఎన్నికల నోటిఫికేషన్‌ వచ్చేలోగా పూర్తిచేయాలని సూచించారు. మున్సిపల్‌ కమిషనర్‌ హేమమాలిని, ఏఈ ఫణి శ్రీనివాస్‌, కౌన్సిలర్లు పాల్గొన్నారు.